## క్లుప్తంగా

### ఘనంగా యువజన సమ్మేళనం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా యువజన సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యసాయిబాబా వందేళ్ల జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ యువజన విభాగం పుట్టపర్తియాత్ర గురించి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో రాష్ట్ర యువ సమన్వయకర్తలు నాగజ్యోతి, నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శిరిగ ప్రభాకర్, జిల్లా యువసమన్వయ కర్త సాయికృష్ణ, యాచం శంకరయ్య, శంకర్‌గౌడ్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### నివాళి



కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత పోలీస్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాఖయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశం, బాలేశ్, లక్ష్మణ్, పాండు, దుర్గేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ



సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలలో సిబ్బంది ఆయా గ్రామాలకు చెందిన వారి వివరాలను ఆన్‌లైన్ చేపడుతున్నారు. ఈ ఆన్‌లైన్ విధానాన్ని తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసాలు పర్యవేక్షిస్తూ, సిబ్బందికి సూచనలందిస్తున్నారు.

### ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వ్యవసాయ పొలంలో పూర్తిగా వంగిపోయి ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభం

కొల్చారం(నర్సాపూర్): వ్యవసాయ పొలాల వద్ద తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటూ రైతుల మృతి చెందుతున్న సంఘటనలు ప్రతిరోజు జరుగుతున్నాయి. వ్యవసాయ పొలాల్లో దెబ్బతిన్న, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు కనిపిస్తున్నప్పటికీ మరమ్మతులు చేయడంలో మాత్రం సంబంధిత శాఖ సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా కనిపిస్తోంది. యాసంగి సీజన్ ప్రారంభమైన తరుణంలో మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో వ్యవసాయ పొలంలో పూర్తిగా వంగిపోయి, ఏ క్షణంలోనైనా విద్యుత్ స్తంభం పడిపోయే పరిస్థితి ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

### వాహనాల వేగానికి కళ్లెం వేయండి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగానికి అంతు లేకుండా పోతోంది. ఫలితంగా ఉదయం, సాయంత్రం విద్యార్థులు రోడ్డు దాటాలంటేనే జంకుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరిసర ప్రాంతాల్లో సంచరించే కోతులు సైతం రోడ్డు దాటుతూ మృత్యువాత పడుతున్నాయి. విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాల బారిన పడతారోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### నేడు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు వంటేరు సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్ తెలిపారు.

# విద్యార్థుల సాగు పాఠాలు

**కేవీకే తునికి శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన**

చిలప్‌చెడ్(నర్సాపూర్): తరగతి గదిలో నేర్చుకునే విద్యతో పాటు క్షేత్ర స్థాయిలో పనులు చేయడం వల్ల ఎక్కువగా అవగాహన కలుగుతుంది. మల్లారెడ్డి యూనివర్శిటీలో బీఎస్సీ అగ్రికల్చర్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఐదురుగు విద్యార్థులు (అభినయ రోహిత, సాయిప్రసన్న, శమభాను, రమ్య) క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన పొందేందుకు గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా మండలంలోని శీలాంపల్లికి వచ్చారు. కృషి విజ్ఞానకేంద్రం తునికి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థులు తమ అనుభవాలను రైతులకు నేర్పుతున్నారు. గ్రామీణ కృషి అనుభవంలో విద్యార్థుల ప్రాజెక్ట్ మూడు నెలలు చేయాల్సి ఉండగా, నెలన్నర సమయం పూర్తయింది. రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించి, పంటలు సాగు చేయాలన్నారు. భూసార పరీక్షలకు కావాల్సిన మట్టిని, నేల నుంచి ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. కందిసాగును పరిశీలించి, పంటకు సోకిన చీడపీడలను వివరించి, వాటి నివారణకు చర్యలు సూచించారు. సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. గ్రామంలో కనీసం 15 మంది రైతులు తప్పనిసరిగా సేంద్రియ వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించారు.



శీలాంపల్లిలో రైతులకు భూసార పరీక్షల గురించి వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు



భూసార పరీక్షలకు మట్టిని తీస్తున్న విద్యార్థులు

### ఎన్నో విషయాలు నేర్చుకున్న..



గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శీలాంపల్లి గ్రామ రైతుల నుంచి క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు నేర్చుకున్న. ఇక్కడి రైతులు ఎక్కువగా వారికి తెలిసిన అనుభవంతో వ్యవసాయం చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేయడం ద్వారా పనులు త్వరగా పూర్తయి, అధిక దిగుబడి సాధించవచ్చని అవగాహన కల్పించా.

– రమ్య, అగ్రికల్చర్ విద్యార్థి

### ప్రకృతి వ్యవసాయం చేయాలి



గ్రామ రైతులు తమ ఆరోగ్య ప్రయోజనాలను, నేల సారాన్ని కాపాడుకునేందుకు తప్పనిసరిగా ఉన్న భూమిలో కొంతవరకైనా సేంద్రియ వ్యవసాయం చేయాలి. ప్రాజెక్ట్ పూర్తయ్యేలోగా కనీసం 15 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా కృషి చేస్తా. రైతులకు తెలియజేసిన విషయాల కంటే, మేము వారి ద్వారా ఎక్కువ విషయాలు నేర్చుకున్నాం.

– అభినయ, అగ్రికల్చర్ విద్యార్థి

# ఆలయాల్లో భక్తజన సందడి



బగలాముఖీ ఆలయంలో భక్తజనం

**అమావాస్య పూజలు, హోమం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, మహాపూజ, హరిద్వార్చన, విశేష పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి సన్నిధి నిండిపోయింది. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ భూదాత స్వరూపరమేశ్‌గుప్తా దంపతులు, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, పోచగౌడ్, కొండల్, వెంకటేష్, రమేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

**చాముండేశ్వరి ఆలయంలో..**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

**తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో..**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, విఘ్నేష్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**అన్నదానం గొప్పది**

శివ్వంపేట(నర్సాపూర్): అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని చాకరిమెట్ల ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ అన్నారు. కార్తీకమాసం సందర్భంగా చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నాగిరెడ్డి గూడంకు చెందిన ప్రభాకర్‌రెడ్డి నెల రోజుల పాటు భక్తులకు అన్నదానం చేశాడు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింగరావు, భక్తులు నారాయణరావు, చంద్రరావు, రాంచంద్రంగౌడ్, హర్షనాయక్, సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణ దాత దశరథరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు దేవదత్తశర్మ ఉన్నారు.

**వేంకటేశ్వరస్వామి ఆలయంలో..**

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో మహారుద్ర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, బాలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, ఆయా గ్రామాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టేక్మాల్(మెదక్): వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్, చైర్మన్ ఆంజనేయశర్మ తదితరులు

### షెడ్డు ఏర్పాటు



ఆలయం వద్ద దాత ఏర్పాటు చేసిన షెడ్డు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద దాతల సహాయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గుట్టపైన కొలువైన స్వామివారి సన్నిధానం మెట్లదారిలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు హైదరాబాదు (పర్శిగుట్ట)కు చెందిన దాత పల్లాటి సరోజన పద్మశాలి కుటుంబ సభ్యులు షెడ్డు ఏర్పాటు చేశారు. వచ్చేనెల నుంచి మూడు నెలల పాటు ప్రతీ ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా దాతల సాయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ శశిధర్‌గుప్తా, ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి తెలిపారు.

# సేవా కార్యక్రమాలు అభినందనీయం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల కోసం సామాజిక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు రవి గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళీధర్ యాదవ్, మల్లేశ్‌గౌడ్, రాజేందర్, రమణారావు రమేశ్‌గౌడ్, అశోక్, సుదర్శన్, నర్సింహరెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

### ఎల్‌ఓసీ అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి విడుదలైన ఎల్‌ఓసీని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం అందజేశారు. మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంకు చెందిన మాధవి అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా ఆమె చికిత్స కోసం రూ. 2 లక్షల విలువైన ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరి వెంట బీఆర్‌ఎస్ నాయకులు పురం రవి, గిరిధర్, సత్యనారాయణగౌడ్, ఆంజనేయులు, కుమార్, కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# నాణ్యమైన భోజనం అందించాలి

**ఆర్డీఓ జయచంద్రారెడ్డి**

మనోహరాబాద్(తూప్రాన్): పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా మండలంలోని కూచారంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం వంటగదిని తనిఖీ చేశారు. వంట పదార్థాల నాణ్యతను, వండిన వంటలను రుచి చూశారు. వంటలు నాణ్యతతో చేయాలని, వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని వంట సిబ్బందిపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి వెంట కేజీబీవీ స్పెషల్ అధికారి గౌతమి, తదితరులు ఉన్నారు.



కూచారం కస్తూర్బాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

# పొట్టు రవాణాతో తప్పని ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా డీసీఎం వాహనాల్లో పొట్టు రవాణాతో వాహనదారుల ఇబ్బందులు తప్పడంలేదు. డీసీఎంకు ఇరువైపుల అదనంగా పొట్టు నింపి రోడ్డుపై నిత్యం వెళ్తున్నప్పటికీ సంబంధిత పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటితో ఎదురుగా, వెనకాల నుంచి వచ్చే వాహనాలకు సైడ్ కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి రవాణాపై సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి ఎస్ఐ మధుకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా వెళ్తున్న పొట్టు లారీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



తూప్రాన్- నర్సాపూర్ హైవేపై వెళ్తున్న పొట్టులారీ

# ప్రజాపాలనపై కళాకారుల ప్రదర్శన

పాపన్నపేట(మెదక్): ప్రజాపాలనలో భాగంగా ఆదివారం పాపన్నపేట, గాజుల గూడెం, నాగ్సాన్‌పల్లిలో కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలతో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాకారులు ప్రభుత్వ పథకాలను పాటలు, నృత్యాలతో వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఆకుల శ్రీనివాస్, దోమకొండ కిషన్ రెడ్డి, కుమ్మరి పోచయ్య, ఆబిద్‌తో పాటు కళాకారులు సిద్ధులు, మాధవి, దేవిదాస్, శేఖర్, ఎల్లయ్య, నర్సయ్య, తుమ్మల ఎల్లం, రామారావు తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో కళాకారులు ప్రదర్శన

# కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలోని కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న సమీపంలోని కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రవి, విక్రమ్ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, భస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం కూష్మాండ దీపారాధన చేసి, గోదుమ పొంగలి నైవేద్యం సమర్పించారు. వెల్మకన్న, అంసాన్‌పల్లితో పాటు వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



నర్సాపూర్: విజేతలకు బహుమతులు అందచేస్తున్న నాయకులు



పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ..

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయా పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని, అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబర్చాలన్నారు.



రామాయంపేట(మెదక్): ప్రశంసా పత్రం అందిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా విద్యాధికారి రాధాకిషన్



కొల్చారంలో..



పెద్దశంకరంపేటలో..



రేగోడ్‌లో..

### సమాజసేవతోనే సంతృప్తి

గజ్వేల్‌రూరల్: ఎంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా సమాజ సేవలోనే సంతృప్తి ఉంటుందని ఎస్‌బీఐ జీఎం ప్రకాశ్ చంద్రభరోర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, సెక్రెటరీ జనరల్ కృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంతోష్ చందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదేవిధంగా లంబాడా నృత్య ప్రదర్శన చేసిన 40మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జితేంద్రకుమార్, వివేక్, చంద్ర బైస్వాల్, అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, రాజ్‌కిరణ్, రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# హెచ్‌ఐవీ నివారణపై అవగాహన ర్యాలీ

గజ్వేల్‌రూరల్: హెచ్‌ఐవీ నివారణపై గజ్వేల్‌లో ఐఎంఏ, ఎన్ఎంఓ, స్నేహ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగమున్నయ్య, కార్యదర్శి డాక్టర్ చంద్రారెడ్డి, కోశాధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరేశ్‌బాబు మాట్లాడుతూ ఎయిడ్స్ సోకినట్లు అనుమానం ఉన్నట్లయితే సమీపంలోని ఏఆర్టీ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు మందులతో సాధారణ జీవితం గడపవచ్చని, వ్యాధిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వైద్యులు, లయన్స్ క్లబ్ స్నేహ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీలో వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు